www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 24 ఏప్రిల్ 2025
5
వైఎస్ఆర్



## పులివెందుల వాసికి గిన్నిస్ బుక్ రికార్డ్స్‌లో చోటు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



అవార్డు అందుకుంటున్న రాజేష్‌కుమార్

మున్సిపాలిటిలోని రాజీవ్ కాలనీలో నివాసం ఉంటున్న దిద్దెకుంట రాజేష్‌కుమార్ సంగీతంలో గిన్నిస్ బుక్ రికార్డు సొంతం చేసుకున్నారు. విజయవాడలోని హలెల్ మ్యూజిక్ స్కూల్ ఆన్లైన్ క్లాస్ ద్వారా సంగీతం నేర్చుకుని 2024 డిసెంబర్ 1న 18 దేశాలలోని 1046 మంది స్వరాలు ఆలపించి ఈ రికార్డును సొంతం చేసుకోన్నారు. రాజేష్‌కుమార్‌కు పులివెందుల పాస్టర్ అసోసియేషన్ సభ్యులు, ఎర్రబల్లి, కొత్తపల్లి ఇమ్మనుయేలు చర్చి పాస్టర్ సిమోనులు, వైవియు లలిత కళల విభాగం అకాడమిక్ ఇన్‌ఛార్జి శేఖర్ రెడ్డి, సుబ్బారాయుడు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

# ఎంఎస్‌ఎంఇ సబ్సిడీలకు మోక్షమేదీ?





**రూ.135 కోట్లు విడుదలకు నిరీక్షణ**
**కాగితాల్లోనే కొప్పర్తి పైప్‌లైన్ పనులు**
**కడప స్టీల్‌ప్లాంట్ హామీకి మంగళమేనా**
**నేడు కొప్పర్తికి పరిశ్రమల శాఖ మంత్రి కె.శ్రీనివాస్**

**జిల్లా పారిశ్రామికాభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది. గత కొంత కాలముగా జిల్లాలోని యర్రగుంట్ల, కొండాపురం మండల ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎన్‌టిపిసి ప్రయాస్, హైడల్ ప్రాజెక్టు పనులకు కూటమి నాయకుల అడ్డంకులు, రాష్ట్ర పాలకులు ఎంఎస్‌ఎంఇలకు ఇవ్వాల్సిన సబ్సిడీలను నిలిపేయడంతో పారిశ్రామిక ప్రగతి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. ప్రభుత్వం కొప్పర్తి నుంచి ఎంఎస్‌ఎంఇ పార్కు తరలిస్తూ జారీ చేసిన జీవోను సైతం ఉపసంహరించకపోవడం, కేంద్రం నుంచి కొప్పర్తి పారిశ్రామికవాడకు పర్యావరణ అనుమతి లభించకపోవడం, పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటు చేయకపోవడం, కడప ఉక్కు పరిశ్రమ నిర్వాహకులను కేసుల పేరుతో తరిమేసిన నేపథ్యంలో పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జిల్లాలోని కొప్పర్తి పర్యటన నేపథ్యంలో కథనం..**

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన వనరులు పుష్కలముగా ఉన్నాయి. జిల్లాకు చెందిన కూటమి నాయకుల అనవ సరమైన ఘర్షణ, వివాదాలతో పరిశ్రమలు రావడానికి జంకుతున్న నేపథ్యం కనిపిస్తోంది. జిల్లాలో దేశంలోనే అరుదైనరీతిలో ఎనిమిది వేల ఎకరాలు కలిగిన కొప్పర్తి పారిశ్రామికవాడ సహా తొమ్మిది పారిశ్రామికవాడలు ఉన్నాయి. చిన్న, మధ్య భారీ తరహాకు చెందిన 3,002 పరిశ్రమలతోపాటు 79,714 ఎంఎస్ ఎంఇలు ఉన్నాయి. 30,146 ఎంఎస్‌ఎంఇ యూనిట్లు వ్యాపార కార్యక లాపాలను సాగిస్తున్నాయి. రాష్ట్ర పాలకులు ఎంఎస్‌ఎంఇ, కొప్పర్తి పారిశ్రా మికవాడకు పర్యావరణ అనుమతులు, తాగునీటి పైప్‌లైన్, ఉక్కు పరిశ్రమ, ఇతర పరిశ్రమలకు సదుపాయాల కల్పనలో మీన మేషాలు లెక్కించడం విస్మయాన్ని కలిగిస్తోంది.

**రూ.135 కోట్ల పరిహారానికి మోక్షమేదీ?**

జిల్లాలోని 30,146 ఎంఎస్‌ఎంఇ నిర్వాహకులు సబ్సిడీకి నోచుకోలేదు. 2021 నుంచి సుమారు రూ.135 కోట్లు సబ్సిడీ విడుదల కావాల్సి ఉంది. కొప్పర్తి పారిశ్రామికవాడ నుంచి ఎంఎస్‌ఎంఇ టెక్నాలజీ పార్కును తరలిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిన నేపథ్యం ప్రజానీకాన్ని ఉద్యమబాట పట్టించిన సంగతి తెలిసిందే. ప్రపంచదేశాల్లోని ఎంఎస్‌ఎంఇలు తమ పారిశ్రామిక ఉత్పత్తులతో ఉపాధి అవకాశాలతో తమదైన ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ప్రభుత్వాలు ఎంఎస్‌ఎంఇల అభివృద్ధిపై దృష్టి సారించాయి.

**కొప్పర్తికి పైప్‌లైన్ ఎప్పుడో? :** ఆసియాలోనే కొప్పర్తి ప్రత్యేకతను సంతరించుకుంది. పారిశ్రా మికవాడకు పర్యావరణ అనుమతులు లభించకపోవడం, పారిశ్రామిక అవస రాలకు రూ.150 కోట్ల వ్యయంతో కూడిన పైప్‌లైన్ సదుపాయాలను కల్పించ డంలో పాలకులు విఫలం కావడం ఆందోళన కలిగిస్తోంది. కేంద్రం కొప్పర్తి పారిశ్రామికవాడకు ప్రాధాన్యత ఇచ్చింది. ఇంతలో వైసిపి హయాంలో కొప్పర్తిలోని ఎంఎస్‌ఎంఇ పార్కును అమరావతికి తరలిస్తూ ప్రభుత్వం జీవోను జారీ చేసింది. కేంద్ర, రాష్ట్ర పాలకుల నిర్లక్ష్యం కారణంగా కొప్పర్తి ఎటువంటి పురోగతికి అవకాశం లేకుండా పోయింది.

**'ఉక్కు' సంగతి అంతేనా! :** జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటును కూటమి సర్కారు మూలన పడేసింది. ఓ సినీ నటి కేసు పేరుతో జెఎస్‌డబ్ల్యు మేనేజ్‌మెంట్‌ను తరిమేసే ప్రయత్నం చేస్తోందనే వాదన ప్రజాసంఘాల నుంచి పెద్ద ఎత్తున వినిపి స్తోంది.యుపిఎ-2 సర్కారు రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీ మేరకు కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాల్సి ఉంది.అనంతరం కేంద్రం లో అధికారంలోకి వచ్చిన బిజెపి, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి, వైసిపి, ప్రస్తుత కూటమి సర్కార్లు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేయడం ఆందోళన కలిగి స్తోంది. 2006 నుంచి 2024 నాటికి మూడుసార్లు శంకుస్థాపనలు చేసిన అనంతరం ఎన్నికలు అయిపోగానే కాగితాలకే పరిమితం చేశారు.

# 'వక్ఫ్'పై నినదించిన ముస్లిం మహిళలు

**సవరణ చట్టానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ర్యాలీ**

ప్రజాశక్తి - కడప అర్బన్



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం మైనార్టీ మహిళలు

వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా నగర పురవీధులు దద్దరిల్లాయి. సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. బుధవారం నగరంలోని అల్మాస్‌పేట సర్కిల్ నుంచి మట్టి పెద్దపులి వీధి, వన్ టౌన్ సర్కిల్, గోకుల్ సర్కిల్, ఏడు రోడ్ల సర్కిల్ వరకు పెద్ద ఎత్తున కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ వక్ఫ్ నల్ల చట్టాన్ని వెనక్కి తీసుకోవాల్సిందే అనే నినాదిస్తూ ఎండను సైతం లెక్కచేయకుండా చిన్న, పెద్ద అనే తేడా లేకుండా పెద్ద ఎత్తున మహిళలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా పిలుపులో భాగంగా వక్ఫ్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ఏడు రోడ్ల సర్కిల్లో సభ నిర్వహించారు. ఈ సభకు జిల్లా కన్వీనర్ రిజ్వానా, జామియతుస్సాలిహాత్ మదరస తస్లీమ్, నాజీమా మద్రాస ఫాతిముతుజ్జర పర్వీన్, జహీరా, సిపిఐ జిల్లా కమిటీ సభ్యురాలు భాగ్యమ్మ, వైసిపి మహిళా భాగం మరియం, ఎస్‌డిపిఐ నాయకులు సోఫియా ఖానం, సాజియా, పీస్ స్కూల్ జుబైదా ప్రసంగించారు. రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత అనేక నల్ల చట్టాలను తీసుకువచ్చి ప్రజలను నానా తిప్పలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాబ్రీ మసీదు విధ్వంసం నుంచి త్రిపుల్ తలాక్, హిజాబ్, ఇప్పుడు వక్ఫ్ సవరణ బిల్లును తీసుకొచ్చి ముస్లిలను అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతు న్నారని పేర్కొన్నారు. ఇది లౌకిక ప్రజాస్వా మ్య దేశమని, అన్ని మతాలు, అన్ని కులాలు కలిసిమెలిసి ఉంటాయని గుర్తు చేశారు. వక్ఫ్ సవరణ, దేవుని పేరుతో ఎవరో ముస్లిం మత పెద్దలు ఇచ్చిన టువంటి భూములు కాజేయాలని మోడీ కన్ను పడి కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తు న్నారని తెలిపారు. మోడీ నీ కథలు సాగవని హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఎన్నికలప్పుడు ముస్లింలు రెండో కన్ను లాంటి వాళ్ళని సవితి కన్నీళ్లు పెట్టుకుని మా ఓట్లను దండుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత తమ భూములను కేంద్ర ప్రభు త్వానికి కట్టబెట్టడం కోసం పార్లమెంటులో ఓటు వేయించి ముస్లింలను మోసం చేశారని టిడిపి ప్రభుత్వం ముస్లింల ద్రోహి అని పేర్కొన్నారు. రంజాన్ ఇఫ్తార్ ఇందులో ఒక మాట చెప్పి రంజాన్ అనంతరం వక్ఫ్ సవరణ బిల్లుకు సపోర్టుగా టిడిపి ఓటు వేయడం దారుణమని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంలో బిజెపితో తెగ తెంపులు చేసుకుని బయట పడినప్పుడే మీకు భవిష్యత్తు ఉంటుందని హెచ్చరిం చారు. కార్యక్రమంలో జెఎసి నగర కన్వీనర్ మౌలానా జాకీర్ హుస్సేన్, కో కన్వీనర్లు, మహిళలు, కాంగ్రెస్. సిపిఐ, ఎస్‌డిపిఐ, వివిధ లౌకిక, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పర్యాటకులపై ఉగ్రదాడి దారుణం

ప్రజాశక్తి - కడప అర్బన్



బద్వేల్ : మాట్లాడుతున్న ఆవాజ్ నాయకులు



కడప : నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జమ్మూ కాశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా పహల్గాం సమీపంలో ఆహ్లాదకరమైన ప్రకృతిని ఆస్వాదిస్తున్న దేశ, విదేశీయ పర్యాటకులపై ఉగ్రవాద ముష్కరులు కర్కశంగా తుపాకులతో దాడి చేసి హతమార్చడం దుర్మార్గం, హేయనీయమని అమాయకుల ఉసురు తీసిన ఉగ్రవాదులను ఏరి బహిరంగ ఉరితీయాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ అభిప్రాయపడ్డారు. బుధవారం హరి టవర్స్‌లో విలేకరులలో ఆయన మాట్లా డుతూ పహల్గాం బైసరన్ లోయలోని విహరిస్తున్న పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్ష నరహితంగా జరిపిన దాడిలో 30 మంది చనిపోవడం, పదుల సంఖ్యలో క్షతగాత్రులు కావడం భారత ప్రజానీకానికి తీవ్ర ఆవేదన, ఆందోళనకు గురి చేసిందన్నారు. దాడిలో అసువులు బాసిన వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. సమావేశంలో ప్రతాపరెడ్డి, టిడిపి నేతలు గంధం ప్రసాద్, సన్నిదానం సాయి పాల్గొన్నారు.

ఉగ్రవాద దాడిని పిరికిపంద చర్య అని, దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందని కన్వీనర్ అహ్మద్ బాబు బాయ్, కో- కన్వీనర్ సయ్యద్ సలావుద్దీన్ పేర్కొన్నారు. కాల్పుల్లో మృతి చెందిన వారికి ఏడు రోడ్ల సర్కిల్లో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేతగానితనం కారణంగానే ఉగ్ర దాడులు చోటు చేసుకుంటున్నాయని ఆక్షేపించారు. ఉగ్రవాదులు ఎక్కడో దాక్కొని అమాయకులైన ప్రజల పైన తుపాకీ తూటాలు ఎక్కువ పెట్టడం నీతిమాలిన చర్య అన్నారు. మానవత్వం ఉన్న వారెవరు ఇలాంటి చర్యలు చేపట్టరని, మృతి చెందిన వారందరికీ వక్ఫ్ పరిరక్షణ కమిటీ నివాళులర్పిస్తుందని చెప్పారు.

**కడప**: ప్రధాని నరేంద్రమోడీ పర్యాటకులకు భద్రతను కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందారని ఎపి కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ పేర్కొన్నారు. బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని కాశ్మీరు లోయలో పహల్గాం ప్రాంతంలో ఉగ్రవాదుల దాడిలో అనేక మంది ప్రాణాలు కోల్పోయిన దురదృష్టకర సంఘటనగా పేర్కొన్నారు. చాలామంది క్షతగాత్రులుగా మిగిలారన్నారు. మన వీర సైనికులు బలి కావడం దురదృష్టకరమన్నారు. ఆయా కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ప్రగాఢ సానుభూతి తెలియ చేస్తోందని వివరించారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాల్సిందే అన్నారు.

**ఉగ్ర దాడిలో పౌరుల మరణానికి కేంద్ర ప్రభుత్వ తీరే కారణం : కాంగ్రెస్**

మహల్గాం వద్ద జరిగిన ఘోర ఉగ్రవాద దాడిలో పర్యాటక పౌరుల మరణానికి కేంద్ర ప్రభుత్వ తీరే కారణమని డిసిసి అధ్యక్షులు ఎస్. డి.విజయ జ్యోతి పేర్కొన్నారు. ఇలాంటి పిరికిపంద చర్యలు మానవత్వానికి మచ్చ అని పేర్కొన్నారు. ఈ దాడిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉగ్ర దాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు. .

**పిరికిపంద చర్య..** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రవాద దాడి పిరికిపంద చర్య అని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వి.రాఘవరెడ్డి ఖండించారు. పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం దారుణమని పేర్కొన్నారు. ప్రాణం విలువ తెలియని కిరాతక హంతకుల దుష్ట చర్యలను అందరూ వ్యతిరేకించారు. ఉగ్రవాదులు ఎక్కడో దాక్కొని అమాయకులైనటువంటి ప్రజల పైన తుపాకీ తూటాలు ఎక్కుపెట్టడం నీతిమాలిన చర్యగా ఆయన అభివర్ణించారు. మానవత్వం ఉన్న వారెవరు ఇలాంటి చర్యలకు పాల్పడరని ఉగ్రవాదులను దూషించారు. ఇలాంటి ఉగ్రమూఖలను తప్పకుండా తుదముట్టించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కిరాయి మూకల, హంతక ముఠాల తుపాకీ గుండ్లకు బలైన వారి కుటుంబాలకు సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. **బద్వేలు :** పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులు హేయనీయమని ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు పి. చాంద్ బాష, బద్వేల్ ఆవాజ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ ,అబ్దుల్ సత్తార్, అన్వర్‌బాష పేర్కొన్నారు. టూరిస్టులపై ఉగ్రవాదులు కాల్పుల జరిపి 27 మంది అమాయకులను పొట్టనపెట్టుకున్నారన్నారు. ఉగ్రవాదుల కాల్పులలో మరణించిన వారి కోసం మౌనం పాటించి నివాళులర్పించారు. సమావేశంలో ఆవాజ్ నాయకులు ఎస్ రహీం , కేబి రసూల్, పి. అల్లా బాకాష్, ఎస్.అబ్దుల్లా , ఎస్. ఫారుక్ పాల్గొన్నారు. **ఖాజీపేట :** జమ్మూ కాశ్మీర్ లోని అనంత్ నాగ్ జిల్లా పహల్గాం సమీపంలో బైసరిన్ లోయలో పర్యాటకులపై ఉగ్రమూకలు దాడి చేయడం హేయమైన చర్య అని, దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు, దేశభక్తి పౌరులు డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన కుటుంబాలకు బుధవారం టిడిపి నాయకులు ఘన నివాళులు అర్పించారు. **పొద్దుటూరు :** ఉగ్రవాద దాడులను సమిష్టిగా ఎదుర్కోవాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్ బాషా పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇలాంటి దాడులను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. కాశ్మీర్ దాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. చనిపోయిన వారిలో ముగ్గురు తెలుగు వారు ఉండడం అత్యంత బాధాకరమన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించి అన్ని విధాలా అండగా ఉండాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు.

# 'పది'లో బాలికలదే హవా

**బాలికలు 83.36 శాతం, బాలురు 78.37 ఉత్తీర్ణత**

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవతరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో బాలికల హవా కొనసాగించారు. బాలికలు 83.36 ఉత్తీర్ణత శాతం నమోదు చేయగా, బాలురు 78.37శాతం నమోదు చేశారు. పరీక్షలకు బాలురు 14,278 మంది హాజరు కాగా 11,189 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 13,402 హాజరుకాగా 11,172 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 27,680 మంది పరీక్షలకు హాజరుకాగా 22,361 మంది ఉత్తీర్ణులయ్యారు. 80.78 శాతం ఫలితాలు నమోదు చేశారు. మొదటి డివిజన్‌లో బాలురు 9,028, బాలికలు 9,613 ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 18,641 మంది మొదటి డివిజన్‌లో ఉత్తీర్ణులయ్యారు. రెండవ డివిజన్‌లో బాలురు 1,525, బాలికలు 1,174 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 2,699 మంది రెండవ డివిజన్ లో ఉత్తీర్ణలయ్యారు. మూడవ డివిజన్‌లో బాలురు 636, బాలికలు 385 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 1,021 మంది మూడవ డివిజన్‌లో ఉత్తీర్ణయ్యారు. మొత్తం 22,361 మంది ఉత్తీర్ణులుగా 5,441 మంది ఫెయిల్ అయ్యారు. మొత్తం 80.43 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. వివిధ మండలాల్లో నమోదైన ఉత్తీర్ణత శాతం పరిశీలిస్తే అట్లూరు 89.33శాతం, బి.కోడూరు 62.66, బద్వేల్ 77.96, బి.మఠం 68.19, సి.కె.దిన్నె 90.05, చక్రాయిపేట 71,83, చాపాడు 77.34, చెన్నూరు 64.31, దువ్వూరు 79.91, గోపవరం 85.12, జమ్మలమడుగు 89.12, కడప 84.52, కలసపాడు 63.59, కమలాపురం 64.33, ఖాజీపేట 75.98, కొండాపురం 93.25, లింగాల 81.94, ముద్దనూరు 89.44, మైదుకూరు 79.25, మైలవరం 80.04, పెద్దముడియం 78.09, పెండ్లిమర్రి 76.71, పోరుమమిళ్ల 87.45, ప్రొద్దుటూరు 84.02, పులివెందుల 82.20, రాజుపాళెం 73.72, కాశీనాయన 68.51, సిద్దవటం 74.77, సింహాద్రిపురం 83.71, తొండూరు 81.22, వి.ఎన్.పల్లె 89.08, వల్లూరు 73.79, వేంపల్లి 74.69, వేముల 77.86, ఒంటిమిట్ట 53.89, యర్రగుంట్ల 62.52 ఉత్తీర్ణతగా నమోదైంది.

# రెవెన్యూ అధికారులపై సమగ్ర విచారణ జరిపించాలి

**- బాధితులకు న్యాయం చేయాలి**
**- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి**

ప్రజాశక్తి - కడప



జెసికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, బాధితురాలు

పెద్దముడియం మండలం రెవెన్యూ కార్యాలయంలో అక్రమాలకు పాల్పడి ఒకరి భూమిని మరొకరికి హక్కు కల్పించిన మండల రెవెన్యూ అధికారులపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని, ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్‌తో కలిసి జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దముడియం మండలం రెవెన్యూ కార్యాలయంలో దీర్ఘకాలం నుంచి డిప్యూటీ తహసిల్దార్‌గా పని చేస్తున్న గౌసియా బేగం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పని చేస్తున్న భువనేశ్వరి అనే ఇద్దరు అధికారులు అనేక రకాల అక్రమాలకు పాల్పడుతున్నారు అన్నారు. తమ హోదాను అధికారాన్ని వినియోగించుకొని ఒకరికి చెందిన భూమిని అక్రమంగా మరొకరి పేరు నమోదు చేసి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. మండలంలోని కొండ పాపయ్య పల్లె గ్రామానికి చెందిన పి. గౌరీదేవి అనే మహిళకు వారసత్వంగా గ్రామంలో 40 ఎకరాల భూమి వచ్చిందన్నారు. ఆమెకు చెందిన భూమి సర్వే నంబర్లకు "పి"అనే అక్షరాన్ని చేర్చి పలువురి పేర్లతో పెద్దముడియం మండలం రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ రికార్డుల్లో ఎక్కించారని పేర్కొన్నారు. ఈవిషయంపై పలుమార్లు బాధితురాలి విన్నవించుకున్నా అధికారులు సరిదిద్దే చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. కలెక్టర్, ఆర్‌డిఒ వంటి అధికారుల నుండి వెళ్లిన విచారణ ఫైళ్లను డిప్యూటీ తహశీల్దార్ గౌసియా బేగం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భువనేశ్వరి తొక్కి పెడుతున్నారన్నారు. ఇది ఒక్క గౌరీదేవికి మాత్రమే సంబంధించిన సమస్య కాదని అన్నారు. పెద్దముడియం మండలంలోని చాలా గ్రామాలలో సర్వే నంబర్లకు 'పి' అనే అక్షరాన్ని చేర్చి ఒకరికి భూములను మరొకరి పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ముందుగా డిప్యూటీ తహశీల్దార్‌ను, ఆర్‌ఐని బదిలీ చేసి నిష్పక్షపాతంగా విచారించాలని అప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరారు. జాయింట్ కలెక్టర్ ను కలిసి వినతి పత్రం సమర్పించిన వారిలో బాధితురాలు గౌరీదేవి కూడా ఉన్నారు.

## పట్టువీడని కృషితోనే విజయం

ప్రజాశక్తి - కడప అర్బన్



ర్యాంకర్‌ను సన్మానిస్తున్న రఘునాథరెడ్డి

సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో 316 ర్యాంకు సాధించిన కె.ఎస్ కీర్తిరెడ్డి పట్టుదల అభినందనీయమని ఎల్‌ఐసి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎ. రఘునాథరెడ్డి అన్నారు. కడపలోని సింగపూర్ టౌన్‌షిప్‌లో కీర్తి రెడ్డి నివాసంలో ఎల్‌ఐసి ఉద్యోగులు ఆమెను కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ కీర్తి రెడ్డి తల్లి శ్రీకృష్ణ ఎల్‌ఐసి డివిజనల్ ఆఫీస్ లో హెచ్‌జిఎగా పని చేస్తున్నారని, తండ్రి చలమా రెడ్డి ఎల్‌ఐసి లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేసి ఇటీవలే రిటైర్ అయ్యారని అన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం తోనే కీర్తిరెడ్డిని సివిల్ సర్వీసెస్ లక్ష్యంగా ఎంచుకున్నారని అన్నారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్‌లో పనిచేస్తున్న భర్త సాయి వెంపాటి నిరంతర సహకారంతో కీర్తి రెడ్డి ఈ విజయం సాధించడం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో యూనియన్ నాయకులు అవధానం శ్రీనివాస్, అక్బర్ బాష, వారిజాతమ్మ, రాజు, వసుప్రద, కుమార్, రఘు జయచంద్ర, చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

## సివిల్స్‌లో బాలవికాస్ పూర్వ విద్యార్థికి 119వ ర్యాంక్

ప్రజాశక్తి - కడప



సివిల్స్‌లో కడప నగరంలోని బాలవికాస్ హైస్కూల్ పూర్వ విద్యారి చెన్నం రెడ్డి శివ గణేష్ రెడ్డికి 119 వ ర్యాంకు లభించింది. 2010 సంవత్సరంలో బాల వికాస్ హైస్కూల్లో ఏడవ తరగతి చేరి 2014 మార్చిలో పదవ తరగతి పూర్తి చేసుకున్న చెన్నం రెడ్డి శివ గణేష్ రెడ్డి ఆల్ ఇండియా 119 వ ర్యాంక్ సాధించడం తమ పాఠశాలకు ఎంతో గర్వకారణం అని పాఠశాల డైరెక్టర్ గంగయ్య, కరస్పాండెంట్ సుబ్బరాయుడు ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో తన వృత్తిలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదిస్తూ అనునిత్యం వెన్ను తట్టి కుమారుని ప్రోత్సహించిన అలంకాన్ పల్లెకు చెందిన మల్లికార్జునరెడ్డి దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**ప్రజాశక్తి -వల్లూరు :** కడప - తాడిపత్రి జాతీయ రహదారి గణేష్ పురంలో అభ్యుదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కడప నగరానికి చెందిన మాతృశ్రీ ఐవిఎఫ్ క్లినిక్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మోబిని, హరి నారాయణ స్వామి రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరంలో స్త్రీ వ్యాధులు, సంతాన సాఫల్య వైద్యం, గర్భకోశ వ్యాధులకు వైద్యం చేసి, అనంతరం మందులు ఉచితంగా అందజేశారు. అభ్యుదయ రూలర్ డెవలప్మెంట్ సొసైటీ కార్యనిర్వహకులను అభినందించారు. కార్యక్రమంలో , తాడిగొట్ల రమణారెడ్డి , ప్రవీణ్ పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

**- రౌడీషీటర్లకు ఎస్‌పి అశోక్‌కుమార్ హెచ్చరిక**

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్‌పి అశోక్‌కుమార్ హెచ్చరించారు. ఆ మేరకు జిల్లాలో రౌడీ షీటర్లకు హెచ్చరికలు జారీ చేసి బైండోవర్ చేశామన్నారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి బుధవారం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పనులకు ఆటంకం కలిగిస్తే ఎవరిని వదిలి పెట్టేది లేదని, వారిపై రౌడీ షీటర్ ఓపెన్ చేస్తామన్నారు. గ్రామాల్లో ఎక్కువ శాతం పొలం తగాదాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. రెండు నెలల్లో పూర్తిస్థాయిలో కానిస్టేబుళ్లను నియమిస్తామన్నారు. సత్యసాయి, అనంతపురం జిల్లాల సరిహద్దులలో జూదం ఎక్కువ ఆడుతున్నట్లు తెలుస్తుందని, వీటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. **లింగాల :** శాంతి భద్రతలకు భంగం కలిగించే వ్యవహారాలు, అసాంఘిక కార్యాకాలపాలపై ప్రత్యేకదృష్టి సారించామని ఎస్‌పి ఆశోక్‌కుమార్ పేర్కొన్నారు. లింగాల పోలీసుస్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. జిల్లాలోని ఆయా మండల పరిధిలలో ఉండే పోలీసు స్టేషన్‌లో పోలీసు వ్యవస్థ పనితీరు పలు అంశాలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. రికార్డులను పరిశీలించారు. ప్రారంభానికి నోచుకోని నూతన పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పలు అంశాలను సిఐ, ఎస్‌ఐ మధుసుదన్‌రావును అడిగి తెలుసుకున్నారు. **చక్రాయపేట :** అసాంఘిక కార్య కళాపాలకు పాల్పడితే పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి అశోక్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం చక్రాయపేట పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిఐ ఉలసయ్య, ఎస్‌ఐ జివి కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు. **తొండూరు :** శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ వెంకటరమణ హెచ్చరించారు.పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణ, నేరరహితంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మండల పరిధిలోని ఇనగలూరు గ్రామంలో బుధవారం రూరల్ సీఐ ఆధ్వర్యంలో నాకబందీ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేరప్రవృత్తికి స్వస్తి పలకాలని సూచించారు. నేరప్రవృత్తిని విడనాడకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గణ మద్దిలేటి, పోలీసులు పాల్గొన్నారు.

## పనికితగ్గ వేతనం ఇవ్వాలి

**- సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ**

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మునిసిపల్ కార్మికులకు పనికితగ్గ వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ కోరారు. బుధవారం ఏపీ మున్సిపల్ వర్కర్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ 3వ పట్టణ మహాసభను ఉద్దేశించి మున్సిపల్ కార్మికులందరూ పాత బస్టాండ్‌లోని మున్సిపల్ వర్కర్స్ మస్టర్ పాయింట్ వద్ద నుంచి సంజామల మోటు శ్రీచక్ర కల్యాణ మండపం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నాగన్న అధ్యక్షతన మహాసభను ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్స్ సమస్యలు ఈ రాష్ట్ర ప్రభుత్వంగానీ గత రాష్ట్ర ప్రభుత్వంగానీ ఏ ఒక్కరూ పరిష్కరించక కాలం గడుపుతున్నారన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ మాట్లాడుతూ కార్మికులందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్మికుల దినోత్సవం నాడు అన్ని రంగాల కార్మికులందరూ కలిసి మే డేను జయప్రదం చేయాలని కోరారు. ప్రతి కార్మికుడికి సమాన పనికి సమాన వేతనం ఇచ్చి సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయాలన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక :** సిఐటియు నూతన కమిటీని 15 మందితో ఎన్నుకున్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా సిరివెళ్ల శేఖర్, పట్టణ అధ్యక్షుడుగా బిర్రు నాగన్న, కోశాధికారిగా గూడూరు శివయ్య, పట్టణ కార్యదర్సులుగా మైకేల్ బాబు, రవి, ఉపాధ్యక్షులుగా చెన్నయ్య, ప్రభావతి, కమిటీ సభ్యులు సురేష్‌బాబు, పుల్లయ్య, వెంకటలక్ష్మి, వినోద్, టీ.ప్రభావతి, బాల చెన్నయ్య, జయలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి.విజయ్ కుమార్, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు దాసరివిజయ్, జి.ఏసుదాసు, ఉపాధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్, పట్టణ సిఐటియు నాయకత్వం, వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ యూనియన్ నాయకత్వం, కార్మికులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

# 'పది' ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

## శ్రీవెంకటేశ్వర స్కూల్ విద్యార్థుల ప్రభంజనం

**ప్రజాశక్తి-కాశినాయన**

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో పోరుమామిళ్ల మండల కేంద్రంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అఖండ విజయాన్ని సాధించారు. స్వరూప 596 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో అగ్రస్థానంలో నిలిచింది. ఖాదర్ బాషా 594,సాయి ధనుష్ 594, .రామదార్శిక 594, గురు హర్షవర్ధన్ 594 మార్కులు సాధించి మండలంలోనే కాక జిల్లా స్థాయిలో మొదటి ఐదు ర్యాంకులు సాధించి జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారు.


స్వరూప 596 గురు హర్షవర్ధన్ 594

## మండల టాపర్‌గా ఎపి మోడల్ స్కూల్ విద్యార్థి

**ప్రజాశక్తి-కాశినాయన**

పదవ తరగతి పరీక్ష ఫలితాలలో మండల టాపర్ ఎపి మోడల్ స్కూల్‌కు చెందిన రామ్ సాయి విగ్నేష్ అనే విద్యార్థి 593 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. ఇటుకలపాడు జడ్‌పి హైస్కూల్ విద్యార్థి 573 మార్కులతో మండలంలో రెండో స్థానంలో నిలిచాడు. అదేవిధంగా 520 మార్కులతో కోడిగుడ్లపాడు విద్యార్థి మూడో స్థానంలో ఉన్నారు. వరికుంట్ల విద్యార్థిని 515 మార్కులతో స్థానంలో నిలిచారు. ఎపిమోడల్ స్కూల్ మండలంలోనేగాక రాష్ట్రంలోనే టాపర్‌గా ఉన్నారని ప్రిన్సిపల్ సౌజన్య తెలిపారు. అనంతరం విద్యార్థులను ఆమె అభినందించారు.


రామ్ సాయి విగ్నేష్ 593

## ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - వల్లూరు**

పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ఆదర్శ పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎం.సురేష్ బాబు తెలిపారు. బుధవారం విడుదలైన పరీక్ష ఫలితాలలో పాఠశాలలో 90 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. పాఠశాలకు చెందిన డి. హర్షిత 579, పి నందిని 576, వై సుశ్మిత 568 మార్కులు సాధించినట్లు తెలిపారు. 26 మంది విద్యార్థులు 500 మార్కులు పైగా సాధించినట్లు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించడంతో ప్రిన్సిపల్ ఎం. సురేష్ బాబు విద్యార్థులను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.



## 'బాలవికాస్' అద్భుత ఫలితాలు

**ప్రజాశక్తి - కడప**

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో కడప నగరంలోని బాల వికాస్ హై స్కూల్ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ గంగయ్య, కరస్పాండెంట్ సుబ్బరాయుడు తెలిపారు. ఎస్. గౌసియా 594 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఎం.మీణ సహన 593 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో, ఆర్. రిహానా హృష్ణ 592, టి. ప్రదీప్ కుమార్ 592, కె. సుదీప్ 592, ఇ. లాస్య 592 మార్కులు సాధించి తృతీయ స్థానంలో, ఎస్. గీతిక 591 మార్కులు సాధించి నాలుగవ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. 590 - 594 ఏడుగురు, 580-589 మధ్యలో 22 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. 570-579 మార్కులను 31 మంది విద్యార్థులు సాధించారు. మొత్తం 186 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వారిలో 145 మంది విద్యార్థులు 500 కు పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంత అద్భుత ఫలితాలను సాధించేందుకు కృషిచేసిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు, సహకరించిన విద్యార్థి తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.


ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

## 'నారాయణ' విద్యార్థుల ప్రభంజనం

**ప్రజాశక్తి - బద్వేలు**

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో స్థానిక తెలుగు గంగా కాలనీలోని నారాయణ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు మార్కుల ప్రభంజనాన్ని సృష్టించారని ప్రధానోపాధ్యాయులు కిషోర్ తెలిపారు. తమ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. అత్యధికంగా సాయిరాం గణేష్ అనే విద్యార్థికి 591 మార్కులు వచ్చాయని చెప్పారు. గౌరీష్ కుమార్ 590, చరిష్మా 590 మార్కులు సాధించారని, మొత్తం 50 మంది విద్యార్థులలో 590 మార్కులకు పైగా ముగ్గురు విద్యార్థులు, 550 మార్కులకు పైగా 22 మంది విద్యార్థులు, 500 మార్కులకు పైగా 36 మంది విద్యార్థులు ఈ ఘనత ను సాధించారని, సబ్జెక్టు వారిగా అత్యధిక మార్కులు తెలుగు 100, హిందీ 98, ఇంగ్లీష్ 98, మ్యాథ్స్ 100, సైన్స్100, సోషల్100 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించడానికి కారణమైన నారాయణ విద్యా సంస్థ యొక్క ప్రణాళికలు, ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం సహకరించాయని, వారికి ప్రధానోపాధ్యాయులు కిషోర్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎజిఎం నజీర్ అహ్మద్, ప్రిన్సిపల్ కిషోర్, అకాడమిక్ డీన్, వైస్ ప్రిన్సిపల్స్, ఎఒ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం

## పది ఫలితాల్లో ఆణిముత్యాలు

**ప్రజాశక్తి- చెన్నూరు**

పదవ తరగతి ఫలితాల్లో మండలంలో విద్యార్థులు సత్తా చాటారు. కొండపేట గ్రామానికి చెందిన గెలివి జగదీష్ కుమార్ కుమారుడు నాగ సత్య మణికంఠ 596 మార్కులు సాధించి మండల టాప్‌గా నిలిచాడు. ఈ విద్యార్థి నంద్యాల జిల్లా పాణ్యం మండలం కేశవరెడ్డి స్కూల్‌లో విద్యను అభ్యసించాడు. చెన్నూరు మండలంలోని ఆర్ఆర్ స్కూల్ విద్యార్థి కె. సరస్వతి విద్యార్థినికి 584 మార్కులు, వెంకట షణ్ముఖ పూజిత582, టి. ప్రణీత 571 మార్కులు సాధించారు. గ్రామానికి చెందిన అంతం సురేంద్ర యాదవ్ కుమారుడు అర్జున్ యాదవ్‌కు అత్యధిక మార్కులు సాధించాడు. ప్రభుత్వ పాఠశాలలో జాహ్నవి 574 మార్కులతో మండల ఆణిముత్యాలుగా నిలిచారు.

## శ్రీవశిష్ట విద్యా మందిర్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - కడప**

పదవ తరగతి ఫలితాల్లో శ్రీ వశిష్ట విద్యా మందిర్ హై స్కూల్ విద్యార్థిని బి. నవ్య శ్రీ 596 మార్కులు సాధించింది. కె. కిషన్ తేజ 579, ఎస్. సోఫియా సుల్తానా 555 మార్కులు సాధించి విజయ దుందుభి మోగించినట్లు స్కూల్ కరస్పాండెంట్ పి.వి.రామనారెడ్డి తెలిపారు. పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీ వశిష్ట విద్యా మందిర్ హై స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు స్కూలు కరస్పాండెంట్ పివి రమణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.


బి. నవ్య శ్రీ 596

## తేజ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థుల విజయం

**ప్రజాశక్తి - కడప**

పదవ తరగతి ఫలితాల్లో కడప నగరంలోని తేజ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఎస్. అలీ అక్బర్ 590 మార్కులు సాధించాడు. 15 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారని స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి. నిర్మలాదేవి తెలిపారు. ఈ విజయానికి కారణమైన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులందరూ భవిష్యత్తులో కూడా మంచి ఫలితాలు సాధించాలని ఆశీర్వదించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన అభినందనలు తెలియజేశారు.


విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి. నిర్మల దేవి

## నారాయణ ఒలంపియాడ్ విద్యార్థులు విజయదుందుభి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

పదవతరగతి పరీక్ష ఫలితాల్లో కడప నారాయణ ఒలం పియాడ్ విద్యార్థులు చారిత్రాత్మక ప్రభంజనం సృష్టించారని ఎజిఎం శ్రీనివాసులు తెలిపారు. జిల్లాలో నంబర్ వన్‌గా నిలిచారని చెప్పారు. ఆర్.సుచరిత 596, షేక్.మహమ్మద్ ఇర్ఫాన్ 595, ఎ.నిహారిక 594, వై.జయమధుమిత 593, జి.త్రిపద 592, ఎం.భవ్యశ్రీ 51 మార్కులు సాధించారని పేర్కొన్నారు. 28 మంది విద్యార్థులు 50 పైగా మార్కులు సాధించారని తెలిపారు. 580కి పైగా 121 మంది విద్యార్థులు ప్రతిభ చూపారని చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల డీన్ చంద్ర కిషోర్‌రెడ్డి, ప్రిన్సిపల్ షరీఫ్, కో-ఆర్డినేటర్ సంపత్, ఎఒ భార్గవ్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. మిఠాయిలు పంచిపెట్టారు.


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఎజిఎం శ్రీనివాసులు

## నాగార్జున మోడల్ స్కూల్ జయకేతనం

**ప్రజాశక్తి - కడప అర్బన్**

పదవతరగతి పరీక్ష ఫలితాల్లో నాగార్జున మోడల్ స్కూల్ విద్యార్థులు విజయ దందుభిని కొనసాగించారు. విద్యార్థుల ఫలితాలను పరిశీలిస్తే ఇ.వెంకట శివమోక్షిత్ 594/600, ఎస్.ఆఫ్రీన్ 593, డి.వెంకట హాసిని 592, పి.హాసిని నవ్య 592, పి.సుదర్శన్ 592, డి.హస్మిత 591, ఎస్.షగుఫ్తా ఈరం 591, జి.హన్సిని 590 మార్కులు సాధించారు. హాజరైన 380 మంది విద్యార్థుల్లు 580కి పైగా 61 మంది, 560కి పైగా 160 మంది, 540కి పైగా 248 మంది, 500కి పైగా 316 మంది మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ ఎం.శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రీదేవి, ఎం.భానేష్ సాయిరెడ్డి మాట్లాడుతూ పరీక్షకు హాజరైన విద్యార్థులు ఉత్తమ ప్రతిభకనబరిచారని పేర్కొన్నారు. 100 నుంచి 65 మంది విద్యార్థులు 90 శాతం మార్కులతో ఉత్తీర్ణలయ్యారని తెలిపారు. 500 మార్కులు పైగా 83శాతం మంది ఉండడం గమనార్హమని చెప్పారు. ప్రిన్సిపల్ కృష్ణవేణి, ప్రధానోపాధ్యాయులు ఎస్.ఎం.బాష, వీరశివ మాట్లాడుతూ నాగార్జున మోడల్ స్కూల్ కీర్తిని మరోకసారి నిరూపించిన విద్యార్థులను అభినందించారు. తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.



## పీస్ స్కూల్ విద్యార్థుల విజయకేతనం

**ప్రజాశక్తి - కడప అర్బన్**

పదవతరగతి పరీక్ష ఫలితాల్లో మరియాపురంలో ఉన్న పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషన్ హైస్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని డైరెక్టర్ సయ్యద్ గౌస్‌పీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సయ్యద్ తాహిరా 575తో స్కూల్ మొదటి సాధనం, షేక్.హాఫ్సా 520, సయ్యద్ ఫాజియా 514 మార్కులతో తరువాత స్థానాల్లో నిలిచారని తెలిపారు. ఫస్ట్ లాంగ్వేజ్ ఉర్దూ + హిందీ 100, సెకండ్ లాంగ్వేజ్ 99, ఇంగ్లీష్ 97, మ్యాథ్స్ 89, సైన్స్ 98, సోషల్ 99 మార్కులు పొందారని చెప్పారు. తమ పాఠశాల విద్యార్థులు వందశాతంతో ఉత్తీర్ణయ్యారని పేర్కొన్నారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పది ఫలితాల్లో మండలం టాప్

**ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె**

పదవ తరగతి ఫలితాలలో మండలం 92 శాతం ఉత్తీర్ణత సాధించిందని మండల విద్యాశాఖ అధికారులు సుజాత ,రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి గాను మండలంలో మొత్తం 1363 విద్యార్థులు పరీక్షలలు రాయగా 1258 ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. శ్రీ చైతన్య స్కూల్లో చదువుతున్న బి.హర్ష కార్తికేయ 592 మార్కులతో మండల టాపర్ గా నిలిచారని పేర్కొన్నారు. అంగడి వీధి ఉన్నత పాఠశాలకు చెందిన భాను ప్రకాష్ 571 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలలో టాపర్‌గా నిలిచారని తెలిపారు. మంచి ఫలితాలు, ఉత్తీర్ణత శాతం సాధించడంలో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. అలాగే రీ కరెక్షన్ కొరకు ఈనెల 24 నుంచి మే 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుంచి 28 వరకు ఉంటాయని, పరీక్ష ఫీజు ఈనెల 24 నుంచి 30 వరకు చెల్లించవచ్చన్నారు.

## పవన్ స్కూల్ విద్యార్థుల సత్తా

**ప్రజాశక్తి - కడప అర్బన్**

పదవ తరగతి పరీక్షా ఫలితాలలో పవన్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కరస్పాండెంట్ లెక్కల జోగి రామిరెడ్డి తెలిపారు. ఎం. స్రవంతి 596/600 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఐదవ ర్యాంకు, జిల్లాలో మూడవ ర్యాంక్, నగరంలో మొదటి ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. టి. స్నేహలత 594, ఎస్.మాలిక్ బాష 588, ఎస్.హర్ష మణికంఠ 586, బి.వెంకట యశ్విత 585 మార్కులు సాధించాలని చెప్పారు. 20 మందికి పైగా 550 మార్కులు సాధించాలని తెలిపారు. 500కు పైగా మార్కులు 50 మంది సాధించారని పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులను ప్రశంసించారు.


స్రవంతి 596 స్నేహలత 594

## నియోజవర్గంలోనే టాప్ బోవిళ్ల హిమబిందు

**ప్రజాశక్తి - బద్వేలు**

10వ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలలో బద్వేల్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని, అట్లూరు మండలం చింటూ వాండ్లపల్లె రైతు కుటుంబానికి చెందిన గోపాల్ రెడ్డి యశోదల కుమార్తె బోవిళ్ల హిమబిందు597 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకు కైవసం చేసుకుంది. బద్వేలు నియోజకవర్గస్థాయిలో ప్రథమ స్థానం సాధించిందని పాఠశాల కరస్పాండెంట్ బి.రాజ మనోహర్ రెడ్డి తెలియజేశారు. భవిష్యత్తులో ఉన్నత చదు వులు చదివి మరింత ఉన్నత స్థాయికి చేరుకునేందుకు పాఠశాల యాజమాన్యం రూ. 50 వేల నగదు బహుమతి అందజేశారు. మధ్యతరగతి కుటుం బానికి చెందిన ఒక విద్యార్థిని ఇంతటి విజయాన్ని సాధించడం చాలా గర్వంగా ఉందన్నారు. విజయానికి కారకులైన విద్యార్థులను, ఉపాధ్యాయులను పాఠశాల కరస్పాండెంట్ రాజమనోహర్‌రెడ్డి, హెచ్ఎం రమణారెడ్డి అభినందించారు.


నగదు బహుమతి అందజేస్తున్నకరస్పాండెంట్

**చాపాడు :** మండల పరిధిలో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 82 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒలు రవిశంకర్, వంశీకృష్ణ తెలిపారు. మొత్తం 355 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 274 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. చాపాడు హైస్కూల్‌కు చెందిన సి.అమృత 553/600 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో మెదటి స్థానంలో నిలిచిందన్నారు. నరహరిపురం హైస్కూల్ విద్యార్థి ఎల్.మేఘప్రియ 541 మార్కులు సాధించి రెండవ స్థానంలో, అయ్యవారిపల్లె పాఠశాలకు చెందిన బి.కిరణ్ 540 మార్కులు సాధించి మూడవ స్థానంలో నిలిచాడని తెలిపారు. ప్రయివేట్ పాఠశాలల్లో గాయత్రి స్కూల్‌కు చెందిన కె పూజిత శ్రావణి 566/600 మార్కులు సాధించి మెదటి స్థానంలో నిలిచిందన్నారు. అదే పాఠశాలకు చెందిన టి విష్ణువర్ధన్‌రెడ్డి 565 మార్కులు, విజేత హైస్కూల్‌కు చెందిన ఏ ధరణి 563 మార్కులు సాధించారని తెలిపారు. కస్తూరిబా బాలికల పాఠశాలలో 36 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 32మంది ఉత్తీర్ణత సాధించారని ఎస్ఓ నాగలక్ష్మి తెలిపారు. పి దివ్య కుళాయమ్మ 531 మార్కులు సాధించగా, జి నందిని 524, వై హనీ శ్రీ 523 మార్కులు సాధిచారని తెలిపారు.


ఉత్తమ ప్రతిభ కనబరిచిన కస్తూర్బా విద్యార్థులు

**మైదుకూరులో 79.08శాతం ఉత్తీర్ణత :** మైదుకూరు మండల వ్యాప్తంగా 79.08శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒలు పద్మలత, నరహరిశర్మ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో 575 మంది పరీక్షలకు హాజరుకాగా 359 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో 62.43శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. బాలికల పాఠశాలకు చెందిన ఎన్ చంద్రలేఖ 579 మార్కులు సాధించి మెదటి స్థానంలో నిలిచిందన్నారు. ప్రయివేట్ పాఠశాలల్లో 658 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 616 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 93.62శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వారు తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో కలిపి 79.08శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. శారద హైస్కూల్‌కు చెందిన పిఎస్ సమీర్, లిటిల్ స్కాలర్స్ పాఠశాలకు చెందిన డి.శివ నాగలక్ష్మి 595 మార్కులు సాధించి నియోజకవర్గ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారన్నారు. శ్రీసాయి స్కూల్‌కు చెందిన సి.దీక్షిత, సెయింట్ ఆల్ఫోన్స్ లిగోరి పాఠశాలకు చెందిన కె హమ్ సిరా 594 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు.

### ఉత్తమ ప్రతిభ కనబరిచిన లిటిల్ స్కాలర్స్ విద్యార్థులు

**వేముల :** స్థానిక జడ్‌పిహెచ్ స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థి జడ కార్తీక్ ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా మండలంలో 590/600 మార్కులతో మొదటి స్థానాన్ని సాధించారు. మండలంలో నల్లచెరువుపల్లె హై స్కూల్ నుంచి రెండవ స్థానం సాధించిన రామిరెడ్డి, ఝాన్సీ 587/600, వేముల హై స్కూల్ నుంచి మూడవ స్థానం మూలి మేఘన 575/600 సాధించారు. మంచి మార్కులతో మండల ఫస్ట్ రావడంతో కార్తీక్ తల్లిదండ్రులు రవి, పుష్పావతి హర్ష వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల కృషిని ప్రధానోపాధ్యాయుడ కె.వెంకట నాగిరెడ్డి అభినందించారు. వేముల జడ్‌పి హైస్కూల్ ఎన్నడూలేని విధంగా మండలంలో మంచి ఫలితాలు సాధించింది.


జడ కార్తీక్

**ముద్దనూరు :** పది పరీక్షల్లో 322 మంది విద్యార్థులకుగాను 288 మంది విజయం సాధించి 89.4శాతం ఉత్తీర్ణులైనట్లు ఎంఇఒ నాగేశ్వర నాయక్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి మండలంలో మొదటి, రెండవ స్థానాల్లో నిలిచారు. ముద్దనూరు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి కె.వైష్ణవి 586 మార్కులు సాధించి మండలంలో మొదటి, యామవరం ఉన్నత పాఠశాల విద్యార్థి కె.బాలాజీ 583 మార్కులతో రెండవ స్థానంలో నిలిచారు. మహర్షి ప్రయివేట్ పాఠశాల విద్యార్థి కె.తేజేష్ 583 మార్కులు సాధించారు. థెరిసా డిలీమా పాఠశాల విద్యార్థి మంజుల కీర్తన 581 మార్కులు సాధించింది. మండలంలో మొదటి, రెండవ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఎంఇఒ నాగేశ్వర నాయక్, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుల శ్రీనివాసులు అభినందించారు.

**వేంపల్లె :** మండలంలోని రామిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జస్వంత్ రెడ్డి పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 592 మార్కులు సాధించి విజయ ఢంకా మోగించాడు. జస్వంత్ రెడ్డి అత్యధిక మార్కులు సాధించడంతో ఆ గ్రామ మాజీ సర్పంచ్ బోరెడ్డి శ్రీరామిరెడ్డి అభినందించారు. రామిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో 68 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హజరు కాగా 67 మంది ఉత్తీర్ణత సాధించారు. 98.5 శాతంతో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 15 మంది ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం పట్ల ఆ పాఠశాల ఉపాధ్యాయులతోపాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు


జస్వంత్ రెడ్డి

**ఖాజీపేట :** స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 552 మార్కులు సాధించిన విద్యార్థి భవ్యశ్రీని ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ, ఎంఇఒ నాగస్వరలత, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా పత్తూరు మెయిన్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సుబ్బారెడ్డి భవ్యశ్రీకి కొంత నగదును అందజేసి అభినందనలు తెలిపారు.


విద్యార్థిని భవ్యశ్రీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**జమ్మలమడుగు రూరల్ :** పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో బాలాజీ హైస్కూల్ విద్యార్థిని డి.నికిత రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంకు సాధించిందని ఆ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి తెలిపారు. తమ పాఠశాల విద్యార్థి నిఖిత 596 మార్కులతో రాష్ట్రస్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచడం హర్షించదగ్గ విషయమన్నారు. 590 మార్కులతో రామకౌశిక్‌రెడ్డి, 588 మార్కులతో ఎస్.సమీరా, 587 శాంతిప్రియ, 586 కెవి తపస్విని రెడ్డి, 580 నరసింహారావుతోపాటు 500పైగా 59 మంది ఉన్నారన్నారు. 590 మార్కులను జమ్మలమడుగులో మొట్టమొదట సారిగా దాటిన హైస్కూల్ బాలాజీ స్కూల్ అన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బైరెడ్డి నిఖిలా రెడ్డి, ఎఒ కె.వి.వి ప్రసాద్ రెడ్డి, ప్రిన్సిపల్ శిరీష, సీనియర్ ఉపాధ్యాయులు ఖాసీం, భరత్, బాషా, సత్యానందం, హృషి కేశవ రెడ్డి, వెంకట్ ప్రసాద్, సంపూర్ణ పాల్గొన్నారు.


డి.నిఖిత 596 రామ్ కౌశిక్‌రెడ్డి

**సింహాద్రిపురం :** మండలంలోని రావులకొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పల్లెటి జోషిక పదవ తరగతి ఫలితాల్లో జిల్లా ఫస్ట్, రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించినట్లు ఎంఇఒ-1 ఓబులేసు తెలిపారు. పది ఫలితాల్లో 600 మార్కులకు 595 మార్కులు సాధించామన్నారు. విద్యార్థిని తల్లిదండ్రులు హరినాథ్‌రెడ్డి, హేమలత వ్యవసాయం చేస్తూ తమ కుమార్తెను చదివిస్తున్నారు. ఎంఇఒ-2 ప్రభుదాస్, పాఠశాల హెచ్ఎం అంకన్న, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ అరవింద్ స్వీట్స్ తినిపించి, శాలువా కప్పి ప్రత్యేకంగా అభినందించారు. డిఇఒ శంషుద్దీన్, పొద్దుటూరు డిప్యూటీ డిఇఒ మీనాక్షి, ఎంపిడిఒ కృష్ణమూర్తి ఫోన్ ద్వారా విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. హిమకుంట్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థిని హర్షిక 588 మార్కులు సాధించారు. శ్రీ వివేకానంద హైస్కూల్ పది ఫలితాలలో ప్రభంజనం సృష్టించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్ వలి, డైరెక్టర్ జాఫర్ తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులైన స్నేహలతరెడ్డి 589, వర్షితకు 582, సూర్య తేజరెడ్డికి 581, హుస్సేన్‌కు 580 మార్కులు వచ్చాయన్నారు. ఈ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.


జిల్లా ఫస్ట్ సాధించిన జోషికను అభినందిస్తున్న ఎంఇఒలు

**ప్రొద్దుటూరు :** బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో శ్రీ చైతన్య ప్రొద్దుటూరు విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 600 మార్కులకుగాను 596 మార్కులు ముగ్గురు సాధించారని, 595 ఆపైన నలుగురికి, 590 ఆపైన 37 మంది, 585 ఆపైన 75 మంది, 575 ఆపైన 137 మంది, 550 ఆపైన 258 మంది సాధించారని పాఠశాల ఏజీఎం నాగిరెడ్డి తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు అభినందన తెలిపారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ మురళీధర్ రావు, ప్రిన్సిపల్ రహమతుల్లా, వినోద్‌కుమార్, హైందవి, డీన్లు ఇన్‌ఛార్జిలు, ఉపాధ్యాయులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో గౌతమ్ విద్యార్థులు అఖండ విజయభేరి మోగించారు. జిల్లా చరిత్రలో కనివిని ఎరుగని ఫలితాలను సాధించి పెట్టారు. ఈ పాఠశాల నుండి జె.శ్రీవాణి 598 అత్యధిక మా ర్కులు సాధించి స్టేట్ మూడవ ర్యాంకు, జిల్లా మొదటి ర్యాంకు సాధించింది. ఈ విద్యార్థిని నర్సరీ నుండి గౌతమ్ పాఠశాలలో విద్యను అభ్యసించింది. 590 పైగా ఐదుగురు విద్యార్థులు, 550పైగా 73 మంది విద్యార్థులు, 500కిపైగా 11 మంది విద్యార్థులు మార్కులు సాధించి రికార్డు సృష్టించారు. ఘన విజయం సాధించిన విద్యార్థులకు, సహకరించిన తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి కరస్పాండెంట్ సుధీర్, డైరెక్టర్ మునిస్వామి నాయుడు ప్రత్యేక అభినందనలు తెలిపారు.


జె.శ్రీవాణి 598

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీరవీంద్ర విద్యా సంస్థలు మంచి ఫలితాలను సాధించారు. ఈ పాఠశాల నుండి లక్ష్మీ ప్రసన్న 589 మార్కులు సాధించింది. 71 మంది పదవ తరగతి పరీక్షలు రాయగా 68 మంది పాసయ్యారు. 500కు పైన 40 మంది విద్యార్థులు మార్కులు పొందారు. ఈ విజయం విద్యార్థులకు అంకితమని కరస్పాండెంట్ పల్లెటి ప్రభాకర్ రెడ్డి అన్నారు.


లక్ష్మీ ప్రసన్న

**ఖాజీపేట :** స్థానిక మైదుకూరు రోడ్డులోని విజేత పాఠశాల విద్యార్థులు బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థి కిరణ్‌కుమార్ 590, జగదీశ్ 590, పద్మజ, 590 మార్కులు సాధించడమే కాకుండా 31 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీదేవి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించి ఘనంగా సత్కరించారు.

**లింగాల :** పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో లింగాల మండలం విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి మంచి మార్కులు సాధించారు. వెలిదండ్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అరుణ్‌కుమార్ రెడ్డి 600కు 585 మార్కులు సాధించి మండల స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. పెద్దకుడాల జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన సుందరేశ్వర్ 600కు 579 మార్కులు సాధించారు. పార్నపల్లె జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థి యామిని 600కు 557, జస్మిత అనే విద్యార్థిని 543 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఎంఇఒ రామకృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. 290 విద్యార్థులు పరీక్షలు రాయగా 237 మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఇఒ చెప్పారు.


అరుణ్‌కుమార్‌రెడ్డి

**పులివెందుల టౌన్ :** స్థానిక నారాయణ పాఠశాల విద్యార్థులు 10వ తరగతి పరీక్షలలో100 శాతం ఉత్తేర్ణులైనారు, సి.మోక్షజ్ఞ రెడ్డి 595 సాధించి టౌన్ ఫస్ట్ గా నిలిచింది, అలాగే బి. మన్విత రెడ్డి 593 సాధించారు, 7 మంది కి పైగా 580 పైన మార్కులు,7 మందికి పైగా 570 పైన మార్కులు సాధించారు, టౌన్ ఫస్ట్ నిలిచిన మోక్షజ్ఞని వారి తల్లిదండ్రులు సి. మధుసూదన్ రెడ్డి, అనురాధను, మాన్వితని ,వారి తల్లిదండ్రులు బి శివరామి రెడ్డి, అంజనదేవిని ఎజిఎం కె. కిరణ్ కుమార్ రెడ్డి అభినందించారు, అలాగే 10 వ తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులను ప్రశంసించారు, కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వి. హరిత రెడ్డి మాట్లాడుతూ బాగా చదివితే ఫలితాలు ఇలాగే వస్తాయని, ప్రతి ఒక్క తల్లిదండ్రులు తమ పిల్లలని బాగా ప్రోత్సాహం ఇవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ భాస్కర్10 వ తరగతి ఇన్‌ఛార్జి హరిత, ఎఒ బాబావల్లి, ఉపాధ్యాయులు ,విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఉత్తమ మార్కులు వచ్చిన విద్యార్థికి పత్రాన్ని అందిస్తున్న కళాశాల సిబ్బంది

## అన్న క్యాంటీన్‌ను పరిశుభ్రంగా ఉంచాలి

**- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి**

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

అన్న క్యాంటీన్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆయన పరిశీలించారు. క్యాంటీన్ పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని అన్న క్యాంటీన్లను మళ్లీ ప్రారంభించారన్నారు. సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గంగిరెడ్డి, జ్ఞానేశ్వర్ నాయుడు, బొజ్జ మైసూరారెడ్డి, శీను పాల్గొన్నారు.

## నేటి నుంచి రాయితీతో విత్తన రిజిస్ట్రేషన్లు

**ప్రజాశక్తి - వేముల**

రాయితీతో వేరుశనగ, మినుము విత్తనాలు రాయితీతో పొందేందుకు గురువారం నుంచి రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు ఎం చెన్నారెడ్డి తెలిపారు. ఆ మేరకు బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బోర్ల కింద వేరుశనగ, మినుము సాగు చేసే రైతులకు 50శాతం రాయితీతో విత్తనాలకు రిజిస్ట్రేషన్లు సంబంధిత రైతు సేవా కేంద్రంలో చేసుకోవాలని తెలిపారు. వేరుశనగ విత్తనాలు ఒకకిలో పూర్తి మొత్తం రూ.96, ఇందులో రాయితీ రూ.48 పోనూ రైతువాట ఒక కిలోకు రూ.48 చెల్లించాల్సి ఉం టుందన్నారు. 30 కిలోల బస్తా పూర్తి ధర రూ.2,880 కాగా, అందులో రూ.1,440 రాయితీ పోతుందన్నారు. ప్రతి రైతుకు గరిష్టంగా మూడు బస్తాల వరకు వేరుశనగ ప్యాకెట్లు ఇస్తామన్నారు. మినుములు పూర్తి ధర ఒక కిలో రూ.140 కాగా, అందులో రాయితీ రూ.70 పోతుందన్నారు. మినుము నాలు గు కిలోల ప్యాకెట్ రాయితీపోను రూ.280 రైతు కట్టవలసి ఉంటుంది. వేరు శనగ, మినుము పంటలు సాగుచేసే రైతులందరూ ఈ అవకాశాన్ని విని యోగించుకొని సంబంధిత రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని తెలిపారు.

## ధర్మవరం రైలు బెంగళూరుకు నడపాలి

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలును ప్రజల సౌకర్యార్థం బెంగళూరుకు నడపాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మచిలీపట్నం నుంచి విజయవాడ, ఎర్రగుంట్ల మీదుగా ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు తిరుగుతోంది. ఈ రైలును ప్రస్తుతం సత్యసాయి జిల్లా ప్రశాంతి నిలయం వరకు పొడిగించారు. అంటే ధర్మవరం నుంచి కేవలం 33 కిలోమీటర్లు పొడిగించారు. ఈ రైలును బెంగళూరు వరకు తిప్పాలని కోరుతూ పలుమార్లు వినతిపత్రం ఇచ్చామన్నారు. ప్రజల సంతకాలతో మాజీఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ఆధ్వర్యంలో గతంలో వినతిపత్రం ఇచ్చామన్నారు. బెంగళూరుకు డైరెక్ట్ రైలు కావాలన్నది కడప, అనంతపురం, కర్నూలుకు చెందిన ప్రజల కోరిక అన్నారు. ప్రశాంతి నిలయం వరకు పొడిగించిన నిర్ణయాన్ని పునరాలోచించి బెంగళూరు వరకు రైలును మూడు జిల్లాల ప్రజల కోసం నడపాలని కోరారు.

## డిసిఎస్ఆర్ ఉర్దూ పాఠశాల వార్షికోత్సవం

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్ )**

మండలం కొత్తపల్లి పంచాయతీలో డిసిఎస్ఆర్ కాలనీలో ఎంపీపీ ఉర్దూ పాఠశాలలో బుధవారం వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీజే రాయలసీమ ఇన్‌ఛార్జి ఎండి అయూబ్ ఖాన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి పిల్లల శక్తి సామర్థ్యాలను వెలికితీయాలని సూచించారు. ఎంపీజే జిల్లా ప్రతినిధి ముక్తియార్ అహ్మద్ మాట్లాడుతూ ఉర్దూ కళాశాలలో మంచి ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీజే స్థానిక అధ్యక్షులు హుస్సేన్ బాషా, కార్యదర్శి రఫీ, ఉపాధ్యాయులు నజిమున్నీసా, షకీలా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


## మాదన్నగారిపల్లెలో ఎంపిడిఒ పర్యటన

**ప్రజాశక్తి - ముద్దనూరు**

మాదన్నగారిపల్లె గ్రామ పంచాయతీలో బుధవారం ఎంపిడిఒ ముకుందరెడ్డి పర్యటించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం, ఉపాధి హామీ పనులు, పారిశుధ్యం, గ్రామ పంచాయతీ కార్యాలయం, నీటి ట్యాంక్, చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయరాం నాయుడు, కార్యదర్శి కె.విజయభారతి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

**బ్రహ్మంగారిమఠం:** స్థానిక ఆర్‌సిఎం ఎంపీయుపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి విరమణ పొందిన ఎల్.మల్లికార్జునరెడ్డిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు ఘనంగా సన్మానించారు. బుధవారం మల్లికార్జునరెడ్డి సన్మాన కార్యక్రమం కరస్పాండెంట్ ఫాధర్ పి.శ్యామ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎర్రంపల్లి రవి కుమార్, ఎస్‌టియు స్టేట్ నాయకులు మల్లు రఘునాథరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులు విచ్చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు. తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎల్.మల్లికార్జునరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

## 'పది'లో మెరిసిన ఆణిముత్యాలు

ప్రజాశక్తి-రామసముద్రం

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో చెంబకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. మండలంలోని కమ్మవారిపల్లి గ్రామానికి చెందిన ఉప్పలపాటి సురేంద్ర కుమార్తె ఉప్పలపాటి కీర్తన 590 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచింది. భువనేశ్వరి 578 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. యంగన్నగారి అనుష్క 572 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచింది.



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ రమణారెడ్డి

## 'ఉషాకిరణ్' విద్యార్థుల అద్భుత ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

పదోతరగతి ఫలితాల్లో ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ బిఎస్.రమణారెడ్డి అన్నారు. పదోతరగతి పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ రమణారెడ్డి అభినందించారు. పూనేటి తేజేష్ 593 మార్కులు, గజ్జల హర్షిని 592 మార్కులు, పోలేపల్లి అనూష్ వర్ధన్ 591 మార్కులు, ఎ.వి.లోకేష్ 589 మార్కులు, కె.స్నేహిత 587 మార్కులు, పి కేశవా నందు 584 మార్కులు, బృంద 579, కె.ముఖేష్ కుమార్ 579, జి విష్ణువర్ధన్ 578 మార్కులు సాధించి చక్కటి ప్రతిభ కనబరిచినట్లు తెలియజేశారు.

## ప్రతిభ చూపిన చిన్నమండెం విద్యార్థులు

ప్రజాశక్తి-చిన్నమండెం

పది పరీక్ష ఫలితాలలో మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎల్. అఫీఫా అనే విద్యార్థిని 574 మార్కులతో మండల టాపర్‌గా నిలిచారు. కెజిబివి స్కూల్ నుంచి బి. అశ్విత 571 , ఆదర్శ పాఠశాల నుంచి ఎస్. సంజయ్ 570 మార్కులు సాధించారు. మండల కేంద్రంలోని ఉర్దూ హై స్కూల్ 100శాతం ఉత్తీర్ణత సాధించిన స్కూలుగా నిలిచింది. ఉర్దూ స్కూల్ నందు 21 మంది విద్యార్థులు హాజరై 21 మంది మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి విజయభేరి మోగించిందని ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. మండల కేంద్రంలోని బాలిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ కష్టపడి క్రమశిక్షణతో చదివి పాస్ అయి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చినందుకు మండల టాపర్ తమ స్కూల్ నుంచి రావడం తమకు సంతోషం కలిగించిందని తెలిపారు.

## భాష్యం విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పదో తరగతి పరీక్ష ఫలితాలలో భాష్యం విద్యార్థులు ప్రతిభ చాటారు. పాఠశాలలో 85 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 84 మంది విద్యార్థులు మంచి మార్కులతో పాసయ్యారు. 593 మార్కులతో యజ్ఞప్రియ సత్తా చాటగా, 590 మార్కులతో మోక్షిత్, హాసినిలు ప్రతిభ చూపారు. 50 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. కళాశాల ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి మిఠాయిలు పంచిపెట్టారు.

# 'పది' ఫలితాల్లో విఎస్ఎన్ విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి-పీలేరు

2024-25 విద్యా సంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో పీలేరు విఎస్ఎన్ సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులు, పీలేరు చరిత్రలో కనీవినీ ఎరుగని అద్భుత ఫలితాలను సాధించి విజయకేతనం ఎగుర వేశారు. బుధవారం రాష్ట్ర విద్యాశాఖ ఎస్-ఎస్‌సి బోర్డు ప్రకటించిన పది పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో విఎస్ఎన్ విద్యాసంస్థలకు చెందిన పి. వెన్నెల స్నేహిత రికార్డ్ స్థాయిలో 600/598 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానంలోనూ, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఎస్.రెడ్డి తనూజ, టి.సూషన్ రాజ కుమారి, ఆర్.స్నేహసాయిలు 600/594 మార్కులు సాధించగా, కె.వైష్ణవి, ఎం.కార్తీక రెడ్డి, కె.జశ్విత 600/593 మార్కులు సాధించారు. ఈ ఏడాది విఎస్ ఎన్ విద్యా సంస్థల నుంచి 244 మంది విద్యా ర్థులు పరీక్షలకు హాజరుకాగా 231 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 11 మంది 590కు పైగా మార్కులు సాధించారు. 56 మంది 550 నుంచి 580 మధ్య మార్కులు పొందారు. 60 మంది విద్యార్థులు 500 నుంచి 550 మధ్య మార్కులు సాధించు కున్నారు. అనూహ్య ఫలితాలు సాధించిన విద్యార్థులను విఎస్ఎన్ విద్యాసంస్థల అధినేత్రి వడ్లమూడి మాధవి అభినం దించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడిచిన 25 ఏళ్లుగా తాము అవిశ్రాంత కృషి చేసి విద్యారంగంలో పీలే రును ఉన్నత స్థానంలో నిలుపుతున్నామని అన్నారు. తమ దగ్గర చదువుకున్న వేలాది మంది విద్యార్థులు అనేక ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలోని పలు శాఖల్లో ఉన్నతో ద్యోగాలు చేస్తున్నారని తెలియజేశారు. దేశీయ, అంతర్రాష్ట్రీయ బహుళ జాతి సంస్థలలోనూ ఉద్యోగులుగా తమ ప్రతిభా పాటవాలు చూపుతు న్నారన్నారు. ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు ఇచ్చిన స్ఫూర్తితో భవిష్యత్తులోనూ మరింత కష్టపడి, మరిన్ని ఉన్నత ఫలితాలు సాధిస్తామని ఆమె తెలిపారు. ఈ ఏడాది ఉన్నత ఫలితాల సాధనలో కష్టపడిన విద్యార్థులను, సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులను, ఉపాధ్యాయ బృందాలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో విఎస్ఎన్ విద్యాసంస్థ అధినేత్రి మాధవి, ఉపాధ్యాయులు

# సాయిబాబా విద్యార్థుల అద్భుత ఫలితాలు



టాపర్‌కు స్వీట్ తినిపిస్తున్న వైస్ చైర్మన్ సాయి సుధీర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని అకాయపల్లెలో ఉన్న సాయిబాబా విద్యాసంస్థల విద్యార్థులు పదవ తరగతి పరీక్ష ఫలితాలలో అద్భుత మార్కులు సాధించారని పాఠశాల చైర్మన్ ఎం.వి. రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ ఎం.వి.సాయి సుధీర్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం మంచి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్మర ధనుంజయ ఆచారి 595/600 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచాడని చెప్పారు. మద్దిరాల గుణ రిషిత 586, షేక్. ఫర్జానా 586, నిఖిత 585 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారని పేర్కొన్నారు. 29 మంది 550 మార్కుల పైన, 80 మంది 500 పైన మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శు భాకాంక్షలు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించడానికి సహకరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. అద్భుత ఫలితాలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులను మరింత మెరుగుగా తీర్చిదిద్దడంలో తమ పాత్ర పోషిస్తామని చెప్పారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ వీరకుమారి

## గురుకుల్ విద్యాపీఠ్ విద్యార్థుల విజయం

ప్రజాశక్తి - కడప అర్బన్

పదవతరగతి పరీక్ష ఫలితాల్లో గురుకుల్ విద్యాపీఠ్ విద్యార్థులు విజయం సాధించారు. యు.చంద్రకళ 595/600, ఎస్.హలీమా ఫాలిమా 594, ఎం.శ్రీవిష్ణు 495/500 (విభిన్న ప్రతిభావంతుడు), ఎ.మనోజ్ఞ 590, ఎ.దీపికారెడ్డి 590, పి.నేహారెడ్డి 588, ఎస్.సాత్విక మైత్రేయి 584, వి.వెంకటసాయి 584 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఎవిఆర్ విద్యా సంస్థల అధినేత ఎ.వెంకటేశ్వర్లు ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని పిలుపు నిచ్చారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల డైరెక్టర్ ఎ.వీరకుమారి, ఎవిఆర్ సిఇఒ ఎ.ఎల్.వివేకానందరెడ్డి, డి.పల్లవి, ప్రిన్సిపల్ ఎన్.మునిచంద్ర, వైస్ ప్రిన్సిపల్ ఇ.నరసింహా, పాఠశాల క్యాంపస్ ఇన్‌ఛార్జి ఆర్.బాబా ఫకృద్దీన్ విద్యార్థులను అభినందించారు.

## 'శ్రీసాయి కృష్ణ' విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - కడప

ఎస్ఎస్‌సి పరీక్ష ఫలితాల్లో కడప నగరంలోని శ్రీ సాయి కృష్ణ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 108 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 104 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 96.29 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. టి. తుషారకు 593 మార్కులు, ఏ. శివ లాస్యకు 593 మార్కులు, వరుణ్ సాయికి 592 మార్కులు వచ్చాయి. అత్యధికంగా ఇద్దరు విద్యార్థులు 593 మార్కులు, ఒక విద్యార్థి 592 మార్కులు సాధించడం గర్వకారణం. 500 మార్కులకు పైగా 54 మంది విద్యార్థులు సాధించారు. తెలుగు, మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో విద్యార్థులు 100 మార్కులు సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించిన విద్యార్థులకు పాఠశాల వ్యవస్థాపకులు ఆదినారాయణ రెడ్డి. కరస్పాండెంట్ సుశీల, ప్రధానోపాధ్యాయులు శిరీష, ఉపాధ్యాయులు అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఆదినారాయణరెడ్డి, కరస్పాండెంట్ సుశీల

## 'పది' ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల హవా

ప్రజాశక్తి - చక్రాయపేట

2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో బాలికల ఉత్తీర్ణత పైచేయిగా ఉంది. ఆ మేరకు ఎంఇఒ రవి కుమార్ మాట్లాడుతూ ప్రథమ స్థానంలో నాగలగట్టుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలిశెట్టిపల్లె గ్రామానికి చెందిన పద్మనాభం కుమార్తె ఆకుల శివశ్రీ 580 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. అదే పాఠశాలలో పి.లోహిత 578 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించారు. బి.జస్వంత్ 577 మార్కులు సాధించి మూడవ స్థానంలో నిలిచారు. నాగులగట్టుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 76 మంది విద్యార్థులు పరీక్షలు హాజరు కాగా 58 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయుడు సంజీవ్ కుమార్ పేర్కొన్నారు. మహాదేవపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎం.భావన 561 మార్కులతో పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ తెలిపారు. 52 మంది పరీక్ష హాజరుకాగా 39 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. గండి గురుకుల పాఠశాలలో ఎం.సంగీత్ నాయక్ 538 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ సురేంద్రబాబు తెలిపారు. గండి గురుకుల పాఠశాలలో 76 మంది పరీక్షకు హాజరుకాగా 56 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కేజీబీవీ బాలికల విద్యాలయంలో ఎన్.వెంకట వర్షిని 529 మార్కులు సాధించి కస్తూర్బా పాఠశాలకు ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఆ కళాశాల ప్రత్యేక అధికారి ఎస్ గౌస్‌ప్యారి తెలిపారు. బాలికల విద్యాలయంలో 31 మంది పరీక్షకు హాజరుకాగా 20 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె తెలిపారు. చక్రాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కె.గురుతేజ 512 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఆ కళాశాల ప్రధానోపాధ్యాయుడు కె రామాంజులు తెలిపారు. చిలేకంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పి.చిన్న 493 మార్కులు సాధించి పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు పివి రమణ తెలిపారు. 15 మంది పరీక్ష హాజరుకాగా 9 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.



ఎ.శివశ్రీ 580/600

## జడ్పీ హైస్కూల్ విద్యార్థుల విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-ములకలచెరువు

ప్రభుత్వ పాఠశాలలో చదివి పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆ పాఠశాల ఉపా ధ్యాయ బృందం ఘనంగా సన్మానించి ర్యాలీ నిర్వహించారు. మండలంలో ప్రభుత్వ పాఠ శాలల్లో ఈ సంవత్సరం పది ఫలితాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కావ్యశ్రీ 577 మార్కులు, జడ్పీ హైస్కూల్ సోంపల్లి విద్యార్థి ఎస్.నౌషాద్ 572, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని ఎస్.ఉస్మాన్ అంజుమ్ 561 మార్కులు సాధించారు. వారిని ఎంఇఒ వెంకటరమణ, శంకరయ్య, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు